క్లుప్తంగా

వాహనాల తనిఖీ



ఆత్మకూర్: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి గాంధీచౌక్, పరమేశ్వర స్వామి చెరువు వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా వాహనాల్లో నగదు తరలింపు, డ్రంకెన్‌డ్రైవ్, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సు పరిశీలించారు. ఎన్నికల నియమావళి, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వహనదారులకు సూచించారు.

గర్భిణులకు సీమంతం



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ మూడో కేంద్రంలో గర్భిణులకు సోమవారం సర్పంచ్ వినీలారాణి ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహార లోపం లేకుండా రోజు తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మంజులారాణి, ఆశావర్కర్ భాగ్యలక్ష్మి, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్



వీపనగండ్ల: ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించాలన్న సదుద్దేశంతో ఉన్నతాధికారుల ఆదేశానుసారం నేర చరిత్ర, గొడవలతో సంబంధం ఉన్న పలువురి వ్యక్తులను తహసీల్దార్ ఎదుట బైండవర్ చేస్తున్నట్లు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు ఎన్నికల నిబంధనల మేరకు నడుచుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

లక్ష్మీనారాయణకు ఘన నివాళి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పృథ్వీరాజు, కురుమయ్య, వెంకటయ్య, మహేష్‌గౌడ్, రంగస్వామి, సంపత్‌నాయుడు, కురుమన్న, మన్నెం, బొక్కలయ్య, నరేష్‌నాయుడు, బాలచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే దేశ భవిష్యత్



ఆత్మకూర్: విద్యార్థులే దేశ భవిష్యత్ అని, విద్యార్థి దశ నుంచే దేశభక్తి పెంపొందించుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ జగదీష్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఏబీవీపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం చేపట్టారు. దేశ హితం కోసం పనిచేస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏబీవీపీ అని, విద్యార్థులు పెద్ద ఎత్తున చేరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల్, రాజేష్, రవివర్మ, భరత్, ప్రవీణ్, మహేష్, సందీప్, అఖీల్, వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ మృతికి సంతాపం

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ జోగేశ్వర్‌గౌడ్ (64) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆర్‌ఎంపీ అకాల మరణంతో వారి కుటుంబంలో విషాదఛాయాలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సలహాదారుగా ఉన్న జోగేశ్వర్‌గౌడ్ మృతిపై జిల్లా అసోసియేషన్, మండల అసోసియేషన్ నాయకులతో పాటు ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ హైమావతి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి భరోసానిచ్చారు.

గాయత్రీదేవిగా అమ్మవారి దర్శనం

ఆత్మకూర్: దేవీశరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా సోమవారం అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, కోట్లాంజనేయస్వామి, అష్టలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిరోజు బతుకమ్మ పూజలు, బొడ్డెమ్మలు, సహస్రకుంకుమార్చన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. పూజల్లో ఎంపీపీ బంగారుశ్రీను, విండో అధ్యక్షుడు గాడికృష్ణమూర్తి, గాడి లక్ష్మీనారాయణ, నిర్వాహకులు గాడి లక్ష్మణ్, శాంతాచారి, గాడిచైతన్య, వినయ్, డీకే రవి, విష్ణుచారి, జిన్నారంశ్రీను, ఆర్యవైశ్య సంఘం నాయకులు వెంకటస్వామి, రమేష్‌శెట్టి పాల్గొన్నారు.

అమరచింత: పట్టణంలోని ఆయా మండపాల్లో కొలువైన భవానీమాత విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రెండో రోజు కాళికామాత ఆలయంలో, విష్ణేశ్వర భవానీనగర్‌లో కొలువుదీరిన అమ్మవారిని బాల త్రిపుర సుందరి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో క్యామ రాములు, మేర్వరాజు, తాటికొండ రమేష్, మోదీ మనోహర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



పామిరెడ్డిపల్లిలో అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు

పెబ్బేరు రూరల్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని గుమ్మడం, సూగూరు గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో గల శ్రీజ్ఞానాంభికాదేవి రెండో రోజు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సహస్రనామ స్తోత్రముతో శ్రీచక్రానికి కుంకుమార్చన చేసి దూప దీప నైవేద్యాలతో అమ్మవారికి మహామంగళహారతి ఇచ్చారు. అదేవిధంగా వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో గల అమ్మవారు గాయత్రిదేవిగా, భవాని మాత ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

పామిరెడ్డిపల్లిలో..

పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో సోమవారం అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. పూజల్లో లక్ష్మణ్‌గౌడ్, పాపిరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజమహేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, చెన్నారెడ్డి, లక్ష్మారెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

పాన్‌గల్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలల్లో భాగంగా రెండవ రోజు సోమవారం అమ్మవారు గాయిత్రి దేవిగా దర్శనమిచ్చారు. మండలంలోని కేతేపల్లిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

మదనాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారిని సోమవారం గాయత్రిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంతో పాటు దుప్పల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక అమ్మవారికి పూజలు నిర్వహించారు.



ఆత్మకూర్‌లో..



కేతేపల్లిలో..



అమరచింతలో..



కొత్తకోట భవాని ఆలయంలో..

డంపింగ్ యార్డు తరలించాలని నిరసన



అమరచింత: పట్టణంలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ట్రాన్స్‌కో కార్మికులు సోమవారం మరికల్, ఆత్మకూర్ ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని చెత్తను తీసుకొచ్చి డంపింగ్ యార్డులో వేయడం, చికెన్, మాంసానికి సంబంధించిన వ్యర్థ పదార్థాలను అక్కడే పారవేస్తుండడంతో దుర్వాసన వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డులోని చెత్తను రోజు విడిచి రోజు తగలపెట్టడంతో పొగతో సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహించలేక పోతున్నామని వాపోయారు. పక్కనే చేనేత వస్త్రాలను తయారు చేస్తున్న కార్మికులు సైతం దుర్వాసనతో కూడిన పగను తట్టుకోలేక రోగాల బారిన పడుతున్నారన్నారు. కలెక్టర్‌కు పలుమార్లు సమస్యను విన్నవించినా మున్సిపల్ అధికారులు స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డును వెంటనే తరలించి తమ ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా ఘటన స్థలానికి చేరుకుని వారం రోజుల్లో డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నామని హామీ ఇవ్వడంతో వారు నిరసనను విరమించారు.

సీఎం కేసీఆర్ అవినీతిని ఎండగడదాం

ఆత్మకూర్/అమరచింత: మక్తల్ నియోజకవర్గంలో బీజేపీ గేలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ రాష్ట్ర నాయకుడు జలేంధర్‌రెడ్డి కోరారు. ఆత్మకూర్, అమరచింత మండలంలో ఆయన ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు జలేంధర్‌రెడ్డి సమక్షంలో సోమవారం బీజేపీలోకి చేరారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ఈసారి బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ప్రజలకు వివరిస్తు, కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. మక్తల్ నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, రేచింతల శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, చిన్ననర్సింహ, శశిధర్‌రెడ్డి, వెంకటేష్, గాడిశేషు, అమరచింత మండల అధ్యక్షుడు హరీష్, ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, క్యామ భాస్కర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కిష్టంపల్లిలో బీజేపీలో చేరిన నాయకులతో జలంధర్‌రెడ్డి

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కొత్తకోట: గడిచిన తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరిస్తూ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు పనిచేయాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి పట్టణ కేంద్రంలోని 10, 11, 12 వార్డులకు చెందిన 150మందికి పైగా వివిధ పార్టీలకు చెందిన వారు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ నాయకుడే ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. సీఎం కేసీఆర్ దేశం గర్వించదగ్గ సంక్షేమ పథకాలను రాష్ట్రంలో ప్రవేశపెట్టారని కొనియాడారు. ఎన్నికల మెనిఫెస్టో చూస్తే కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు డిపాజిట్లు దక్కే పరిస్థితి లేదన్నారు. నియోజవర్గాన్ని సీఎం కేసీఆర్ ఆశీస్సులతో ఎంతో అభివృద్ధి చేసుకున్నామని ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ ప్రకటించిన మెనిఫెస్టోను ప్రతి కార్యకర్త గ్రామాల్లో ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి బీఆర్‌ఎస్‌కు మూడోసారి విజయాన్ని కట్టబెట్టాలని పిలుపునిచ్చరు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, పి.విశ్వేశ్వర్, గాడీల ప్రశాంత్, సంజీవుడు, సాక బాలనారాయణ, చీర్లనాగన్నసాగర్, యాదయ్యసాగర్, అయ్యన్న, రాములుయాదవ్, రాజుయాదవ్, హోటల్ అంజి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మున్సిపల్ చైర్‌పర్సన్ భర్తపై చర్యలు తీసుకోండి

అమరచింత: కొత్తకోట మున్సిపల్ చైర్‌పర్సన్ పొగాకు సుఖేసిని భర్త పొగాకు విశ్వేశ్వర్ మున్సిపల్ మేనేజర్‌పై దురుసుగా ప్రవర్తించి పరుష పదజాలంతో దూషించడం సరికాదని అమరచింత మున్సిపల్ కమిషనర్, టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఖాజా అన్నారు. మున్సిపల్ మేనేజర్‌పై జరిగిన ఘటనపై సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కొత్తకోట మున్సిపల్ మేనేజర్ రవీందర్ మున్సిపాలిటీ ట్రాక్టర్ అవసరాల కోసం 15లీటర్ల డీజిల్ కోసం చీటి రాసి పెట్రోల్ బంక్‌కు పంపిచారన్నారు. దీనికి మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, కుమారుడు కలిసి తమకు చెప్పనిదే చీటి రాయడానికి నువ్వు ఎవరవని, నీకేం అధికారం ఉందని పరోక్షంగా దాడికి యత్నించారని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలతో మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై పాలక వర్గ కౌన్సిలర్లు, చైర్మన్లు దూషించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. బాధ్యుడైన పొగాకు విశ్వేశ్వర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు బాల గోవిందు, కృష్ణయ్య, ప్రభాకర్, లక్ష్మయ్య, మునిస్వామి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో నిరసన వ్యక్తం చేస్తున్న కమిషనర్, సిబ్బంది

భవిష్యత్‌కు భరోసా బీఆర్‌ఎస్

కొత్తకోట రూరల్: గడిచిన 60, 70 ఏళ్ల అన్యాయాన్ని పదేళ్లలో సరిచేశామని, ప్రజల భవిష్యత్ కోసమే సీఎం కేసీఆర్ శ్రమిస్తున్నారని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి పెద్దమందడి మండలంలోని వెల్టూర్‌లో పర్యటించారు. గ్రామానికి వస్తున్న మంత్రికి గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడడంతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్న సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్లలో విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, విద్యుత్, సంక్షేమం వంటి రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచడం జరిగిందన్నారు.

బెల్టు షాపులపై దాడులు

ఆత్మకూర్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం బెల్టు షాపులపై దాడులు నిర్వహించారని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. సోమవారం రాత్రి ఎఫ్‌ఎస్‌టీ టీం ఇన్‌చార్జీ నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని ఖానపూర్‌లో శ్రీమన్నారాయణ కిరాణషాపులో తనిఖీలు చేపట్టి 20 లీటర్ల మద్యం, రూ. 10,840 స్వాధీనం చేసుకున్నారన్నారు. పట్టుబడిన మద్యాన్ని సీజ్ చేయడంతో పాటు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

మద్యం అమ్మితే చర్యలు

గోపాల్‌పేట: కిరాణ షాపుల్లో మందు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని రేవల్లి ఎస్‌ఐ శివకుమార్ హెచ్చరించారు. సోమవారం రేవల్లి మండల కేంద్రంలోని ఓ కిరాణ షాపులో మద్యం అమ్ముతున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి లిక్కర్, బీరు బాటిళ్లను సీజ్ చేయడంతో పాటు షాపు యజమాని నరారి శ్రీనుపై కేసు నమోదు చేశారు. గ్రామాల్లో ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టంచేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పెబ్బేరు రూరల్: మండలంలోని తోమాలపల్లికి చెందిన సంధ్యపాగ నిరంజన్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాంపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు, మండల బీఆర్‌ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు సోమవారం గ్రామంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ట్రాక్టర్ల డ్రైవర్లు రూ.31 వేలు, బీఆర్‌ఎస్ నాయకులు రూ 12,500, కాంగ్రెస్ నాయకులు రూ.5 వేలు అందజేశారు.

బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతో సబ్బండ వర్గాలకు మేలు



కొత్తకోటలో మాట్లాడుతున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్



మదనాపురంలో..

కొత్తకోట రూరల్: సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్‌ఎస్ మేనిఫెస్టో రాష్ట్రంలోని సబ్బండ కులాలకు న్యాయం జరిగే విధంగా ఉందని జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. బీఆర్‌ఎస్ ఎన్నికల మెనిఫెస్టో విడుదలపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ గతంలో విడుదల చేసిన మేనిఫెస్టోలో 90శాతం పూర్తి చేయడంతో పాటు కొత్త పథకాలు కూడా అమలు చేశారన్నారు. పేద మహిళలకు 'సౌభాగ్యలక్ష్మి' పేరుతో రూ.3వేలు గౌరవ భృతి ఇస్తామని చెప్పడం ఎంతో సంతోషకరమని, అర్హులైన పేద కుటుంబాలకు వంట గ్యాస్ సిలిండర్ రూ.400లకే ఇవ్వడంతో పాటు కేసీఆర్ ఆరోగ్యరక్ష ద్వారా రూ.15లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్నట్లుగానే వైద్య బీమా పేరుతో జర్నలిస్టులకు రూ.15లక్షల వరకు నగదు రహిత వైద్యం అందించేందుకు సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. మాయమాటలు చెప్పి కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యిందని ఎద్దేవా చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వంశీధర్‌రెడ్డి, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసులు, వైస్‌ఎంపీపీ వడ్డె శ్రీను, గాడీల ప్రశాంత్, కె.శ్రీనివాస్‌జీ, జగన్‌రెడ్డి, సాక బాలనారాయణ, కొండారెడ్డి, సుభాష్, గుంత మల్లేష్, కిరణ్ తదితరులు ఉన్నారు.

50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఏం చేశారు?

మదనాపురం: కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో పేదలకు చేసింది ఏమీ లేదని, తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ నేతృత్వంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మోసపూరితమైన హామీలు ఇచ్చి కర్ణాటకలో గద్దినెక్కిన కాంగ్రెస్ వాటిని నెరవేర్చడంలో విఫలమైందన్నారు. రైతు, దళిత, బీసీ బంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతు బీమాతో పాటు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రావణ్‌కుమార్ రెడ్డి, గోపాలకృష్ణ, వెంకట్‌నారాయణ, టీసీ నాగన్న, యాదగిరి, చాంద్ పాషా, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

పౌష్టికాహార లోపాన్ని అధిగమించాలి

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని చెన్నారంలో సోమవారం మదనాపురం కృషివిజ్ఞాన కేంద్రానికి చెందిన డాక్టర్ దాదాసాహెబ్ కోగారే ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళా రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణుల్లో పోషకాహార లోపం ఎక్కువగా కనిపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఇంటి పరిసరాల్లో సేంద్రియ పద్ధతుల ద్వారా పెరటి తోటలు సాగు చేసుకోవాలని సూచించారు. అంతే కాకుండా ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి వచ్చే చెత్త, కూరగాయల వ్యర్థాలు, పశువుల పేడతో వర్మీ కంపోస్టు తయారు చేసి పెరటితోటల్లో వాడటం వల్ల ఆరోగ్యాన్ని చాలా వరకు కాపాడుకోవచ్చన్నారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం నిపుణులు అనిత మాట్లాడుతూ బయోఫెర్టిసైడ్ వంటి వంగడాలు పెరటి తోటల్లో పెంచడం వల్ల పోషకాలు ఎక్కువగా లభిస్తాయని చెప్పారు.



మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ఆధార్‌కేంద్రం వద్ద జనం బారులు

పాన్‌గల్: ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, నూతన కార్డులు పొందడం, ఫోన్ నెంబర్లు లింకు చేసుకునేందుకు సోమవారం మండల కేంద్రంలోని ఆధార్ కేంద్రం వద్ద వివిధ గ్రామాల నుంచి వచ్చిన జనం పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ప్రతి అంశానికి ఆధార్‌కార్డు ప్రమాణికం కావడంతో కార్డులో ఏమైనా తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు జనం ఆధార్‌కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, సర్వర్ పనిచేయకపోవడం వంటి సమస్యలతో కేంద్రాల వద్ద గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు.



పాన్‌గల్ ఆధార్‌కేంద్రం వద్ద గుమికూడిన జనం

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన

అమరచింత: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను ఆగమేఘాలుగా ఏర్పాటు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా విద్యుత్ సౌకర్యంతో పాటు ఫ్యాన్లు, బల్బుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అదే విధంగా పరిసరాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు. పట్టణంలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో వసతుల సమకూర్చుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.



విద్యుత్ మరమ్మతు చేపడుతున్న కార్మికులు

వ్యక్తిపై కేసు నమోదు

పెబ్బేరు రూరల్: దాడి ఘటనలో ఒకరిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన గుంటి పెద్దబాబు, తమ్ముడు గుంటి చిన్నబాబు మధ్యంపొలం నీటి వంతుల విషయంలో పాత గొడవలు ఉన్నాయి. పాత గొడవలను మనస్సులో పెట్టుకొని తనపై తమ్ముడు గుంటి చిన్నబాబు కర్రతో దాడి చేసి గాయపరిచాడని పెద్దబాబు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంటి చిన్నబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

'బాలలు వారి హక్కులు తెలుసుకోవాలి'

గోపాల్‌పేట: బాల బాలికలు వారి హక్కులపై అవగాహన పెంచుకోవాలని చైల్డ్‌లైన్ కౌన్సిలర్ రాజేష్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో బాలబాలికలకు వారి హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పిల్లల హక్కులను పరిరక్షించడంతో పాటు అనాథ పిల్లల బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని అన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు ఆపద వస్తే వెంటనే 1098, లేదా 100 నంబరుకు ఫోన్ కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అలా చేస్తే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. సీడబ్ల్యూసీ, జేజేబీ, చైల్డ్‌లైన్, డీపీఓ, ఎస్‌సీఎల్‌పీ కమిటీలు వాహనంలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. బాలరక్షక్‌తో బాలికలకు అందించే రక్షణ, పరిరక్షణ సేవలు మరింత చేరువయ్యాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రవిరాజ్, కేస్ వర్కర్ రాజు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రాజేష్‌కుమార్

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

ఆత్మకూర్: బతుకమ్మ సంబరాల్లో భాగంగా ఆత్మకూర్‌లోని జన్‌కో క్వార్టర్స్‌లో సోమవారం రాత్రి ఘనంగా బతుకమ్మ సంబరాలను జరుపుకొన్నారు. ఈసందర్భంగా బతుకమ్మ విశిష్టత గురించి ఆడి, పాడి వివరించారు. కార్యక్రమంలో డీఈ రూపేష్, ఏడీఈలు రవిశంకర్, రజనీకాంత్, రామలింగేశ్వర్ రెడ్డి, ఏఈలు శివకుమార్, విజయ్‌కుమార్, భరత్‌కుమార్, మహిళలు తదితరులు ఉన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ముద్దపప్పు బతుకమ్మలను రకరకాల పూలతో ఘనంగా అలంకరించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట బతుకమ్మలను ఉంచి ఉద్యోగులు పాటలతో బొడ్డెమ్మలు ఆడుతూ సంబురాలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, సీనియర్ అసిస్టెంట్ వరమ్మ, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి కార్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.



పాన్‌గల్ ఎంపీడీఓ కార్యాలయంలో బతుకమ్మలతో ఎంపీడీఓ, ఉద్యోగులు